క్లుప్తంగా

నేడు భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన



భగవాన్ వెంకయ్య స్వామి

జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంట గ్రామంలో పాలేరు నది సమీపంలో కొలువై ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి ఆలయ ఆవరణలో గురువారం ఉదయం ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఆరాధన పూజా కార్యక్రమాలు, సాయంత్రం ఏడు గంటల నుంచి అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

72 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉమ్మనపల్లి గ్రామంలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ సందీప్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వైద్య క్యాంపులో 72 మందికి బీపి , షుగర్, రక్త పరీక్షలు, జలుబు, దగ్గు, తదితర పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది ఉన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

హనుమంతునిపాడు: పండ్ల తోటల్లో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి ఎం అంజలీబాయి అన్నారు. మండలంలోని కూటాగుండ్ల, ముప్పళ్లపాడు రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో నిమ్మ, ఉద్యానవన పంటల సాగు అధికారులతో సమావేశమై తెగుళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూటాగుండ్ల, ముప్పళ్లపాడు గ్రామాల్లో సాగులో ఉన్న నిమ్మ, కూరగాయాలు, తోటలు పరిశీంచారు. నిమ్మతోటలకు ఆకు ముడత, కాయకు మంగు, పేను బంక, గజ్జి, వేరుకుళ్లు, ఎండు పుళ్ల తెగుళ్లనట్లు గురించారు. నివారణ చర్యలను వివరించారు. ఉద్యానవన శాఖ వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

పింఛన్లపై ఫైనల్ వెరిఫికేషన్

వెలిగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పింఛన్లకు సంబంధించి ఫైనల్ వెరిఫికేషన్ ప్రక్రియకు ఎంపీడీఓ టి. సుకుమార్ శ్రీకారం చుట్టారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు నూతనంగా 129 పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వివిధ దశలో వెరిఫికేషన్ ప్రక్రియ జరిగింది. బుధవారం ఎంపీడీఓ సుకుమార్ దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఫైనల్ వెరిఫికేషన్‌లో అర్హత కలిగిన వారికి సెప్టెంబర్ ఒకటవ తేదీనుంచి ఫించన్ నగదు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఏఓ మహబూబ్ బాషా, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి



ఈ క్రాప్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

పీసీపల్లి: పంట వేసిన ప్రతి రైతు తమ పంటను తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని చింతగుంపల్లి, గుంటుపల్లి ఆర్‌బీకేలను వ్యవసాయాధికారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటలను పరిశీలించారు. అనంతరం ఈ క్రాప్‌ను నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ప్రతి ఒక్క రైతు తాము సాగు చేసిన పంటను గ్రామవ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓల వద్ద నమోదు చేయించుకోవడం ద్వారా పంట నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులకు ఆర్‌బీకేల్లో యూరియా, కాంప్లెక్స్ డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇద్దరు వీఆర్‌ఓలకు పదోన్నతి

వెలిగండ్ల: ఇద్దరు వీఆర్‌ఓలకు పదోన్నతి లభించినట్లు తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి తెలిపారు. పి. నాగులవరం వీఆర్‌ఓ కె. పద్మనాభంకు ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ కనిగిరి ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. కొట్టాలపల్లి వీఆర్‌ఓ వేల్పుల వెంకటేశ్వర్లుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ కనిగిరి ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. వీరిద్దరూ బుధవారం రిలీవ్ అయ్యారు.

ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి

- ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



మున్సిపల్ ఆఫీసులో నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్



వైఎస్సార్ భవన్‌లో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

కనిగిరి రూరల్: ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశంపంతులు ఆంధ్ర రాష్ట్ర సాధనలో చేసిన కృషిని కొనియాడారు. ప్రకాశం పంతులు ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. తుపాకి తూటాలకు ఎదురొడ్డి నిలిచిన ప్రకాశం పంతులు ఆంధ్రకేసరిగా గుర్తింపు పొందారని కొనియాడారు. తొలుత ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు ఎల్ తిరుపతిరెడ్డి, గాలిబోయిన ధనంజయ్, ఎస్‌కే ఖాజా, సర్పంచ్‌లు పోతు వెంకట రమణారెడ్డి, దమ్ము వెంకటయ్య, నాగేంద్రారెడ్డి, మూలే మాలకొండారెడ్డి, జానీ, లింకన్, పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, జిల్లా, రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, నాగూర్‌వలి, భారతి, నాగూర్‌బీ, కంటు గురవయ్య, ఏడుకొండలు, మురళీ, మధు, శ్రీ హరిరెడ్డి, ఖాదర్ వలి, బీటీ ఆర్.మీరావలి, తిరుపతయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

ప్రకాశం పంతులు జయంతి వేడుకలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, కౌన్సిలర్లు దేవకి సత్యావతి, పెన్నా ఏడుకొండలు, అబ్రహం లింకన్, దాసరి మురళీ, సయ్యద్ రిజ్వానా ఖాలక్, గ్యాస్ సందాని, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చెన్న కేశవులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్ర పటానికి జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంకిరెడ్డి, నారాయణ రెడ్డి, పచ్చవ వెంకట సుబ్బయ్య, దమ్ము వెంకటయ్య, రమేష్‌రెడ్డి, మహేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మార్గం అనుసరణీయమని ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటీషవారికి గుండెచూపి ఎదురొడ్డిన ధీరశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. దేశభక్తి, దానగుణం కలిగిన వ్యక్తి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుఅని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కేటీవీ నరసింహారావు, స్రవంతి, సుచరిత, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్.నాయబ్‌రసూల్, పోతల రమేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు హెచ్‌ఎం షేక్.మహబూబ్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకాశం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తోట రమేష్, నెల్లూరి నీరజ, బి.కోటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు 'టంగుటూరి'

సింగరాయకొండ: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని కొండపి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఎన్.సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జరుగుమల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్ర పటానికి ఎంఈఓ నాగేంద్రవదన్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బ్రిటీష్ పాలనలో సైమన్‌ను ఎదిరించి చరిత్రలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో టంగుటూరి జయంతిని హెచ్‌ఎంలు ఎం.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ,డి.అనూరాధ, ఎల్.అనూరాధ తదితరులు ఘనంగా నిర్వహించారు.

కొండపి: మండలంలోని వెన్నూరు జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం డి.భారతి అధ్యక్షతన టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కొండపిలోని గ్రంథాలయంలో బత్తుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు.

టంగుటూరు: స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజారావు ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.



కలికవాయలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జరుగుమల్లిలో నివాళులర్పిస్తున్న ఎంఈఓ నాగేంద్రవదన్



వెన్నూరు హైస్కూల్లో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



టంగుటూరు గురుకుల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



ప్రకాశం పంతులు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



పామూరులో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

కూలీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

- ఏపీఓ పనితీరుపై ఎంపీపీ వెంకటరెడ్డి ఆగ్రహం



ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: మండలంలో ఉపాధి హామీ పథకం కూలీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలో 11,303 జాబ్‌కార్డులు ఉన్నాయని, 2023–24 సంవత్సరానికిగాను 980 పనులు గుర్తించగా 108 పూర్తయ్యాయని, రూ.8.68 కోట్లు ఖర్చు కాగా ఒక్కో కూలీకి సరాసరిన రూ.188 దక్కుతోందని ఏపీఎం రాంబాబు వివరిస్తుండగా ఎంపీపీ కలగజేసుకున్నారు. కూలీలందరికీ సమానంగా డబ్బు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్ద ఉన్న వారికి హాజరు ఎందుకు వేస్తున్నారు? ఒక్కో కూలీ వద్ద రూ.200 చొప్పున ఎందుకు వసూలు చేస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా పనిచేస్తామంటే కుదరదని మండిపడ్డారు. దీనిపై ఏపీఎం మాట్లాడుతూ.. గతంలో కూలీల వద్ద నగదు తీసుకున్న మాట వాస్తవమేనని, ఇక నుంచి ఎలాంటి తప్పు జరగదని తెలియజేశారు. పని ప్రదేశాలకు వెళ్లి ఎవరు ఎంత పనిచేశారో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి జాబితా తయారుచేసి కలెక్టర్‌కు నివేదించాలని ఎంపీడీఓ బ్రహ్మయ్యకు సూచించారు. అనంతరం వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతుండగా తమకు ఇన్సూరెన్స్ నగదు రాలేదని గార్లపేట ఎంపీటీసీ కొండారెడ్డి, వేమవరం సర్పంచ్ ముప్పరాజు సుబ్బయ్య సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే దళితవాడలో 100 కుటుంబాలకు తాగునీరు అందడం లేదని, క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలని కోఆప్షన్ సభ్యుడు కోంద్రు ఇబ్రాయిల్ కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఈఓఆర్డీ నాగూర్‌వలి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ



హాస్టల్‌లో పరిశీలన చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని బాలిక సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలన్నారు. బాలికలతో కలిసి అల్పాహారాన్ని తిన్నారు. రికార్డులు పరిశీలించి తగు సూచనలిచ్చారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, బాలికల భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వసతి గృహం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వసతి గృహ వెల్ఫేర్ అధికారి జయంతి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు జి. అబ్రహం లింకన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్డీని కలిసిన చైర్మన్, కమిషనర్



ఆర్డీని సన్మానిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావును బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావులు ఘనంగా సన్మానించారు. ఆర్‌డీ ఎంఏ కనిగిరికి వచ్చిన సందర్భంగా మున్సిపల్ ఆఫీసులో ప్రజాప్రతినిధులు ఆయనను కలిశారు. పలు అభివృద్ధి పనులు అంశాలను ఆర్‌డీఎంఏ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మున్సిపల్ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో కూర్చుని వీసీని వీక్షించారు. ఆ తర్వాత పట్టణంలో పర్యటించారు. ఈయన వెంట కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చంద్రయాన్- 3 విజయవంతంపై ర్యాలీ



చంద్రయాన్-3 విజయోత్సవర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు



కలికవాయలో కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎం

పామూరు: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై పామూరులో ప్రభుత్వ పాఠశాలల, జూనియర్ కళాశాల విద్యార్థులు, నాయకులు బుధవారం విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. పాఠశాలల్లో విద్యార్థులు చంద్రయాన్3 ల్యాండింగ్ దృశ్యాలను వీక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య, కొండిశెట్టి రమణయ్య, పలువురు నాయకులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలు

సింగరాయకొండ: చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలను కలికవాయ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు.

రూ.2.50 లక్షలతో ఆర్వోప్లాంటు ఏర్పాటు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాత డాక్టర్ సాగిరాజు వెంకటరాజు

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులు, గ్రామస్తులకు రక్షిత మంచినీటిని అందించేందుకు దాతల కృషి అభినందనీయమని తిమ్మరాజుపల్లె ఎంపీపీఎస్ హెచ్‌ఎం చెన్నకేశవులు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో గ్రామానికి చెందిన సాగిరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సాగిరాజు వెంకటరాజు తన సొంతనిధులు రూ..2.50 లక్షలతో గ్రామంలో ఆర్వోప్లాంటు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆర్వోప్లాంటును బుధవారం దాత డాక్టర్ సాగిరాజు వెంకటరాజు గ్రామస్తులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులకు, పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా మినరల్ వాటర్ అందజేయడం అభినందనీయమన్నారు. దాతలకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. పందిళ్ల యల్లయ్య, కొట్టే రవీంద్ర, జి.సురేష్, చంద్రశేఖర్, డి.వెంకటరాజు, పాపారావు, బ్రహ్మయ్య, పెదపాపయ్య, పాపారావు, బాలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు



దాసరిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

హనుమంతునిపాడు: మండలంలోని దాసరిపల్లి పంచాయతీలో బుధవారం రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు పనులు గ్రామ సర్పంచ్ యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీ నుంచి మెయిన్ గ్రామంలోకి సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. గడప గడపకు కింద వచ్చిన రూ 20 లక్షలతోను, ఎంపీపీ మండల గ్రాంట్ రూ.5 లక్షలు, ఎంపీ గ్రాంట్ రూ.5 లక్షతో పనులు మొదలు పెట్టామన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఎస్సీ కాలనీ నుంచి మెయిన్ గ్రామంలోకి రోడ్డు సమస్య తీరుతుందన్నారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కనిగిరి రూరల్: వెట్టి చాకిరి నివారణకు అధికారుల బృందం బుధవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మిక, రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్, విద్య, సాంఘిక సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లోని, పునుగోడులో క్వారీల్లో, ఫ్యాక్టరీల్లో విస్తృత తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల చేత వెట్టి చాకిరి చే యిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యాక్ట్ ప్రకారమే కార్మికుల చేత పనులు చేయించుకోవాలని, బాల కార్మికులను పనుల్లో ఉంచకూడదని, 18 ఏళ్లు నిండిన వారే పని చేయాలని తెలిపారు. బాల కార్మికుల చేత పనులు చేయిస్తే వారు శిక్షార్హులవుతారని చెప్పారు. క్వారీల్లో, గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులతో మాట్లాడి ప్రభుత్వం కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి తెలిపారు. ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డులను తీసుకోవాలని తెలిపారు. రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. క్వారీ, ఫ్యాక్టరీ యజమానులకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. కార్మిక శాఖ అధికారులు సుబ్బరాయుడు, ఎం భూపాల్, పి సుజాత, జి.బాలకాశీనాయక్, ఆర్ఐ కృష్ణా మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులు కిరణ్, నాగరాజు, మంద్రు రమేష్, సుమతి, సుమన్, రాజేశ్వరి, సలోమి, పురుషోత్తం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డీఎంహెచ్‌ఓ పి.రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని నందనవనం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ కంచుకొండ శ్రీధర్‌రెడ్డి 63 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ చంద్రశేఖర్ ఎంపీహెచ్‌ఏ సురేష్, హెప్సిబా, స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గన్నారు.

నేడు టంగుటూరులో జేసీఎస్ రిజిస్ట్రేషన్ క్యాంప్

టంగుటూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వార్డు, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లను ప్రజలతో మమేకం చేసేందుకు సాయంత్రం 3 గంటలకు ఆరు మండలాల సచివాలయ కన్వీనర్ల రిజిస్ట్రేషన్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పార్టీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, జేసీఎస్ రాష్ట్ర కన్వీనర్ పుత్తా శివశంకర్‌రెడ్డి, కొండపి నియోజకవర్గ పరిశీలకులు రూప్‌కుమార్ యాదవ్ పాల్గొంటారని పేర్కొన్నారు. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల సచివాలయ కన్వీనర్లు తమ ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు.

ముగిసిన పొగాకు వేలం

- కొండపిలో 14.17 మిలియన్ కేజీలు, టంగుటూరులో 13.88 మిలియన్ కేజీల విక్రయం
- రైతుల ఖాతాల్లో రూ.615.75 కోట్లు జమ చేసినట్లు బోర్డు అధికారుల వెల్లడి

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గత 133 రోజులుగా సాగిన వేలం ప్రక్రియ బుధవారంతో ముగిసింది. చివరి రోజు పొగాకు వేలాన్ని బోర్డు ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొండపి వేలం కేంద్రం పరిధిలో రైతులు ఈ ఏడాది 14.17 మిలియన్ కేజీల పొగాకు విక్రయించి రూ.309 కోట్లు పొందారని వెల్లడించారు. కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి మండలాల పరిధిలోని 45 గ్రామాల రైతులకు 9.94 మిలియన్ కేజీలకు అనుమతి ఇవ్వగా 14.17 మిలియన్ కేజీలు పంట పండించారన్నారు. వేలం కేంద్రం అధికారి ఎస్. రామారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది 6 లక్షల కేజీలకు పైగా చూరను రైతులు విక్రయించి రూ.5.55 కోట్లు పొందారని తెలిపారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు బుధవారంతో ముగిశాయి. వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొత్తం 123 పనిదినాల్లో కొనుగోళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 9.88 మిలియన్ కేజీలు పండించేందుకు బోర్డు అనుమతివ్వగా 13.88 మిలియన్ కేజీల ఉత్పత్తి వచ్చిందన్నారు. రైతుల ఖాతాల్లో 306.73 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. గత సీజన్‌తో పోల్చితే అన్ని గ్రేడ్లకు ఈ ఏడాది మార్కెట్‌లో మంచి ధర లభించడం శుభపరిణామన్నారు. పరిమితికి మించి పండించిన పొగాకుపై జరిమానా రద్దు చేయడం, వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంపై సాగుదారులు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.